క్లుప్తంగా

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

టెక్కలి: మండలంలోని బన్నువాడ గ్రామంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు కోర్టు వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైంగిక నేరాల నుంచి చిన్న పిల్లలకు రక్షణ చట్టాలు అనే అంశంపై సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాయంత్రం ఈ సదస్సు నిర్వహిస్తామని వెల్లడించారు.

విద్యార్థులకు శిక్షణ తరగతులు

టెక్కలి: స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విద్యార్థులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏపీఎస్ఎస్‌డీసీ సీఎం ఎక్స్‌లెన్స్ కేంద్రం ద్వారా కళాశాల డైరక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 'ప్రొడక్ట్ డిజైన్ అండ్ డ్రాఫ్టింగ్' అనే అంశంపై 137 మంది విద్యార్థులకు శిక్షణ అందజేశారు. స్కెచ్చింగ్ అండ్ పార్ట్ డిజైన్, అసెంబ్లీ డిజైన్, సర్ఫేస్ మోడలింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కె.ప్రసన్నలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, మెకానికల్ హెచ్‌వోడీ పి.శ్రీహరి, స్వాక్ డైరెక్టర్ బి.రామారావు, వై.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

టెక్కలి: కోటబొమ్మాళి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లఖినేని శ్రీనివాసరావును గురువారం ఎన్నుకున్నారు. అలాగే జనరల్ సెక్రటరీగా యు.తిరుమలరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్.తిరుపతి, సహాయ కార్యదర్శిగా కె.వెంకట్రావు, కోశాధికారిగా బి.ధర్మారావు తదితరులను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా నిర్వహించిన వై.వెంకట్రావు తెలియజేశారు.

విద్యార్థులకు అవగాహన

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పీ-4 సర్వే, ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా పీ-4 సర్వే విధానంపై డివిజన్ గణాంకాధికారి నందా, ఆయుష్మాన్ భారత్‌పై రీజనల్ కో-ఆర్డినేటర్ ఎస్.రామచంద్రరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేధావుల ఫోరం అధ్యక్షుడు జీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



కృష్ణారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని కొర్లాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గుడియా కృష్ణారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ గురువారం పరామర్శించారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, పార్టీ నాయకులు పట్టాభి రామారావు, కోట్ని శ్రీనివాసరావు, బంగారు పాపారావు, బాలరాజు, చంటి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం




షిర్డీసాయిని దర్శించుకుంటున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం గ్రామంలో షిర్డీసాయి బాబా ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఉలాసి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వేకువజామున బాబావారి మేల్కొలుపు హారతి, అభిషేకాలు చేపట్టారు. అనంతరం చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు బాబాను దర్శించుకున్నారు. 12 గంటల పాటు ఆలయం ఆవరణలో కచేరీ నిర్వహించారు. అనంతరం సాయంత్రం సాయిబాబా పాదుకలను ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు.

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామంలో ఉన్న షిర్డీసాయి ఆలయం 18వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా వేకువజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాయంత్రం తిరువీధి మహోత్సవం, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పార్టీ నేతలు లడ్డుకేశవపాత్రో, డొక్కరి బలరాం, వంకల ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

చెలరేగిన మంటలు



రోడ్డుపై దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం

కాశీబుగ్గ: జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం ఒక ద్విచక్ర వాహనంలో మంటలు చెలరేగడంతో దగ్ధమైంది. ఈ ఘటన పలాస మండలం రామకృష్ణాపురం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యువకుడు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించిన యువకుడు తక్షణమే అప్రమత్తమై బైక్‌ను వదిలి సురక్షితంగా దూరం వెళ్లాడు. అయితే ప్రమాదానికి గల కారణం తెలియలేదు.

ప్రమాదాల మలుపులు..!

- రోడ్డు మలుపుల్లో నిత్యం ప్రమాదాలు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని వైనం



జగన్నాథపురం గ్రామం వద్ద మలుపు



జగన్నాథపురం మలుపు వద్ద లోయలోకి దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు(ఫైల్)



లొద్దపుట్టి-జరడా మలుపు వద్ద లోయలో పడిన ఇటుకల ట్రాక్టర్(ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్:

గ్రామీణ ప్రాంత రహదారుల్లోని మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారుతున్నాయి. మండలంలో జగన్నాథపురం, ఇన్నేశుపేట, ధర్మపురం, కేశుపురం వంటి ప్రాంతాల్లోని మలుపులు వద్ద వారానికి కనీసం ఒక ప్రమాదం చోటుచేసుకుంటుంది. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలను ఢీకొంటూ వాహనచోదకులు గాయాల బారినపడుతున్నారు. గతంలో జగన్నాథపురం, ధర్మపురం మలుపుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతి చెందిన ఘటనలు స్థానికులు ఇప్పటికీ మరచిపోలేకపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



జరడా రోడ్డు నుంచి మొదలు జగన్నాథపురం వరకు ఎక్కువగా మలుపులు ఉండడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా మొక్కలు పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపక్కన చిన్నపాటి లోయలు కూడా ఉండడంతో వాహనచోదకులు ఆ లోయల్లో పడిపోతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ స్పందించి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలి

– ఆశి పురుషోత్తమరెడ్డి, గ్రామస్తుడు, జగన్నాథపురం

రోడ్డు వెడల్పు చేయాలి



లొద్దపుట్టి నుంచి టి.బరంపురం మీదుగా పాత్రపురం వెళ్లే రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇటీవల ఒడిశా నుంచి వచ్చే ప్రైవేటు బస్సు ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించబోయి లోయలోకి దూసుకుపోగా, మూడు రోజుల క్రితం ఇటుకలతో వస్తున్న ట్రాక్టర్ జగన్నాథపురం మలుపులో తిరగబడిపోయింది. డ్రైవర్ తీవ్రగాయాలతో బయటపడ్డాడు. ఇంత జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించడం లేదు. రోడ్డు మరమ్మతులు చేపట్టి వెడల్పు చేస్తే కొంతవరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చు.

– వంది మధు, జగన్నాథపురం

సూచిక బోర్డులు లేవు



తిప్పనపుట్టుగ జంక్షన్ నుంచి డొంకూరు వెళ్లే రహదారిలో అధికంగా రోడ్డు మలుపులు ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరగడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రోడ్డుపక్కన ఈదుపురం వద్ద హైస్కూల్ ఉండడంతో బడి విడిచిపెట్టే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రమాద సూచిక బోర్డులు కూడా లేవు. చాలా మంది ఈ రోడ్డులో ప్రమాదాలబారిన పడ్డారు.

– దున్న గురుమూర్తి, బూర్జపాడు

కిడ్నీ బాధితులను ఆదుకున్నది వైఎస్సార్‌సీపీనే

- పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుర్యోధనరావు



దుర్యోధనరావు

కాశీబుగ్గ: ఉద్దానం కిడ్నీ బాధితులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ఆదుకుందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. గురువారం ఆయన పలాసలో మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసే సమయంలో కిడ్నీ బాధితుల కష్టాలను తెలుసుకొని, అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి మేలు చేసేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. దీనిలో భాగంగా పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు రూ.10 వేల పింఛన్ అందజేసినట్లు తెలియజేశారు. అలాగే రూ.700 కోట్లతో వంశధార నుంచి ఇంటింటికీ శుద్ధ జలం అందేలా వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు తీసుకొని రావడం జరిగిందన్నారు. కానీ టీడీపీ హయాంలోనే కిడ్నీ బాధితులకు మేలు జరిగినట్లు మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో అసత్యాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కిడ్నీ బాధితుల కోసం మొసలి కన్నీరు కార్చుతున్నారని ధ్వజమెత్తారు. అధికారం చేపట్టి 10 నెలలవుతున్నా సూపర్ సిక్స్ అమలుకు చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబాట్టారు. ఇప్పటికైనా హామీలు అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

మందస: మండలంలోని వెనుకబడిన తరగతుల మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ బీసీ కార్పొరేషన్ ద్వారా అందించడం జరుగుతుందని, ఆసక్తి కలిగిన మహిళలు ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రమేష్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తులు ఆహ్వానం

కాశీబుగ్గ: మందస మండలంలోని వీరగున్నమ్మపురం సమీపంలో ఉన్న కేజీబీవీలో 2025-26 సంవత్సరానికి గానూ 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘుపాత్రుని వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయన్నారు. సందేహాలకు 70751 59996, 70750 39990 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేద్దాం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కంచిలి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి ఐక్యంగా కృషి చేద్దామని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆస్పత్రి ఆవరణలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.హరిబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా వివిధ పనులకు సంబంధించి తీర్మానాలు చేశారు. సమావేశంలో ఎంపీడీవో వి.తిరుమలరావు, సర్పంచ్ ఎల్.లక్ష్మి, పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పనులు చేపట్టాలి



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

నందిగాం: గ్రామాల్లో వలసలు నివారించడానికి ఉపాధి హామీ పనులను పక్కాగా చేపట్టాలని డ్వామా పీడీ బి.సుధాకర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సామాజిక తనిఖీలు గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్పీలు పంచాయతీల నివేదికలు చదివి వినిపించారు. మండల పరిధిలో మొత్తం రూ.64,500ల రికవరీ, రూ.91 వేల అపరాధ రుసుము విధించారు. పలు పంచాయతీల్లో 10 రోజుల్లో మొక్కలను తిరిగి నాటాలని స్పష్టం చేశారు. మరోసారి తప్పిదాలు దొర్లితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజారావు, అదనపు పీడీ రాధ, టెక్కలి క్లస్టర్ పీడీ శైలజ, జిల్లా విజిలెన్స్ అధికారి స్వరూపారాణి, ఎస్‌ఆర్పీ తిరుపతిరావు, ఏపీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఇందిరా చౌక్ కూడలిలోని స్నేహా జ్యూయలర్ షాప్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. దుబ్బ వంశీ అనే యువకుడు స్కూటీపై వస్తుండగా, ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన మహ్మద్ షాహిద్ అనే వ్యక్తి పల్సర్ బైక్‌తో ఢీకొన్నాడు. ప్రమాదంలో వంశీ ఎడమ కాలు, చేయి, తలకు దెబ్బలు తగిలి, చెవి నుంచి రక్తం కారడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. వెంటనే స్థానికులు స్పందించి పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ భూమిని పరిరక్షించాలి



ఆలయ భూములను చూపిస్తున్న కమిటీ ప్రతినిధులు

కంచిలి: మండలంలోని అంపురం గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కనున్న చింతామణి అమ్మవారి ఆలయాన్ని, భూమిని పరిరక్షించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరుతున్నారు. ఈ మేరకు విలేకరులతో గురువారం మాట్లాడారు. ఆలయానికి సంబంధించి సుమారు 17 సెంట్లు భూమి ఉందని, అయితే దీనిలో ఉత్తర భాగంలో ఉన్న ఆలయ భూమిని కొందరు ఆక్రమించాలని పన్నాగం పన్నుతున్నారని ఆరోపించారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమ్మవారి ఆలయం వెనుక భాగంలో పొలాలు కొనుగోలు చేసి, ఆలయ స్థలం నుంచి రోడ్డు వేసేందుకు కొందరికి డబ్బు ఆశ చూపిస్తున్నారని వాపోతున్నారు. 'ఏవో రాళ్లు తెచ్చి పాతిపెట్టి, వాటిని అమ్మవారి విగ్రహాలని చెబితే అయిపోతుందా' అని ప్రశ్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని, ఆలయ భూములు ఆక్రమణలకు గురవ్వకుండా చూడాలని కోరుతున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మద్ది అప్పారావు, మద్ది ఆనందరావు, మద్ది ఆదినారాయణ, నూకయ్య, ఎం.మోహనరావు, జగ్గారావు, నీలయ్య, ఎం.దాలయ్య, ఎం.పితంబర్, నర్తు రామారావు, ఎం.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

సోంపేట: మండల పరిషత్ నిధులతో పూర్తి చేసిన నిర్మాణాలకు వెంటనే బిల్లులు విడుదల చేయాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు పూర్తయ్యాక బిల్లులు మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సగంలో ఉన్న పనులు సైతం పూర్తిచేసేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ, పంచాయతీరాజ్ ఏఈ రమేష్, ఏవో భాస్కరరావు, ఎంపీటీసీలు పొడుగు కామేష్, బొమ్మిడి ధర్మరాజు పాల్గొన్నారు.

నిధులను సమగ్రంగా వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈవో విశ్వనాథం

ఇచ్ఛాపురం రూరల్: పాఠశాలల సముదాయ సమావేశాలకు కేటాయించిన నిధులను సమగ్రంగా వినియోగించుకోవాలని మండల విద్యాశాఖాధికారులు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథంలు సూచించారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు, కార్యదర్శులు, సీఆర్‌ఎంటీలతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఏడు స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయన్నారు. ఒక్కో కాంప్లెక్స్‌కు రూ.లక్ష చొప్పున నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిధులను సముదాయ నిర్వాహణకు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కోసం ఖర్చు చేయాలని సూచించారు.

మిషన్ వాత్సల్యపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ వాత్సల్యపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ రామారావు సూచించారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో సచివాలయం ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాలు అరికట్టడం, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టడానికి తల్లిదండ్రులను చైతన్యవంతం చేయాలన్నారు. తల్లీతండ్రి లేని పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.4 వేలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి



ఇచ్ఛాపురం టౌన్: అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శంకరరావు

వజ్రపుకొత్తూరు రూరల్: చిన్నారులకు నైతిక విలువలు పెంపొందించాలని ఐసీడీఎస్ పీవో కె.పార్వతి, మండల విద్యాశాఖాధికారి వెంకటరమణ సూచించారు. మండలంలోని వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ భీ పడాయి భీ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తారకేశ్వర పండా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్.ధనలక్ష్మి, యూ.లత, గంగమ్మ, సరస్వతీ, జయమ్మ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ పడాయి భీ కార్యక్రమం స్థానిక జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ వి.శంకరరావు గురువారం ప్రారంభించారు. చిన్నారుల పోషణ, ఆరోగ్య పరిరక్షణ, ఆరోగ్య సూత్రాలపై ఐసీడీఎస్ పీవో నాగరాణి అవగాహన కల్పించారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లు చూపిస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని కవిటి నెలవంక రోడ్డులో గురువారం చేపట్టిన తనిఖీల్లో 22 మద్యం బాటిళ్లతో కె.కపాసుకుద్ది గ్రామానికి చెందిన ఎర్ర కూర్మారావు అనే వ్యక్తి పట్టుబడినట్లు ఎస్ఐ వి.రవివర్మ వెల్లడించారు. దీంతో అతనిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చలివేంద్రం ఏర్పాటు



సోంపేట మండలంలోని ఇస్కలపాలేం గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి పి.స్వప్న తెలిపారు. ప్రజలంతా వేసవిలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.అంకమ్మ, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. – సోంపేట

విద్యార్థుల ఔదార్యం



పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన బూరగాపు సూర్యంకు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో అతనితో పాటు రంగోయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అండగా నిలిచారు. సుమారు 46 మంది సోషల్ మీడియా వేదికగా సుమారు రూ.36 వేల విరాళాలు సేకరించారు. అనంతరం శ్రీకాకుళంలోని కిమ్స్ ఆస్పత్రికి చేరుకుని గురువారం అతడికి ఆర్థిక సాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. – కాశీబుగ్గ

తవ్వేశారు...వదిలేశారు!



రోడ్ల మరమ్మతుల పేరుతో బాగానే ఉన్న రోడ్డును తవ్వేసి వదిలేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని బూర్జపాడు నుంచి సీమూరు మీదుగా నెలవంక వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్ జేసీబీతో పదిహేను రోజుల క్రితం హడావుడిగా రోడ్డు తవ్వకాలు జరిపి వదిలేశాడు. దీంతో అప్పటి నుంచి ఆ రహదారి గుండా ద్విచక్రవాహనాలు, ఆటోలపై వెళ్లాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – ఇచ్ఛాపురం రూరల్

ఆశీల వేలంపాట వాయిదా



మాట్లాడుతున్న కమిషనర్ రమేష్

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని ఆశీల బహిరంగ వేలంపాటను ఈనెల 25వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ఎస్.రమేష్ తెలిపారు. పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో కమిషనర్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి దినవారీ బజారు, వీధిగుత్తలు, కమేశాలకు సంబంధించి ఆశీల వసూళ్లకు బహిరంగ వేలంపాట గురువారం నిర్వహించారు. ముందుగా రూ.23 లక్షల సర్కారు పాటగా ప్రారంభించారు. దీంతో సర్కారు పాట అధికంగా ఉందని వేలంపాటదారులు ముందుకు రాలేదు. ఫలితంగా ఈనెల 25వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అప్పలస్వామి, ఆర్ఐ పి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పలాస: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస ఆర్టీసీ డిపో మెయిన్ గేట వద్ద గురువారం కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైనవారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. 1/19 సర్క్యులర్ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ పొందినవారి స్థానాల్లో వెంటనే ఖాళీలు భర్తీ చేయాలని విన్నవించారు. చలో అనకాపల్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎంయూ డిపో కార్యదర్శి ఏవీ రావు, పున్నయ్య, డీఎల్ నారాయణ, వాలి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఇచ్ఛాపురం రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సెర్ప్ ఏపీఎం ఎస్.ప్రసాదరావు ఆకాంక్షించారు. మండలంలోని ఎ.బలరాంపురం గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళా ప్రతినిధులతో సమావేశం గురువారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకం వలన కలిగే పరిణామాలు వివరించారు. హోమ్ కంపోస్ట్, కిచెన్ గార్డెన్, ఇంకుడు గుంతల వలన కలిగే లాభాలను తెలియజేశారు. ఉల్లాస్ వయోజన విద్యకు సంబంధించి ఈనెల 23వ తేదీన పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో వారితో పరీక్షలు రాయించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు